క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సోమవారం సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్ర భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు, గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు వలంటీర్లుగా సేవలు అందించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

నేరడిగొండ: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు జక్కుల నారాయణ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎంఏ కలీమ్‌కు, పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, ఇళ్లు, రుణాలు, పరికరాలు, బ్యాక్‌లాక్ పోస్టులు అందడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోశెట్టి, రాథోడ్ గణేష్, కత్తుల పురం నారాయణ, కైపల్లి శంకర్, ధ్యాగల సత్యనారాయణ, ధ్యాగల చిన్నయ్య, నర్సారెడ్డి పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌ఈవో పవర్ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని వాంకిడి గ్రామంలో టీబీ వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. టీబీ అంటు వ్యాధి కావడంతో ఒకరి నుంచి మరొకరికి సోకుతుందన్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంతోష్, విజయలక్ష్మి, నరసయ్య, శ్రీలత, గంగామణి పాల్గొన్నారు.

రేపు ఆదివాసీల పాదయాత్ర

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని కుమురంభీం కాలనీలో నివసిస్తున్న ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కుమురం భీంకాలనీ నిర్వహణ కమిటీ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇంటి స్థలాలకు పట్టాలతో పాటు నీరు, విద్యుత్, విద్య, వైద్యం, రోడ్డు రవాణా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే ఈ పాదయాత్ర ఉదయం 11గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రధాన పోస్టల్ కార్యాలయం వద్దకు చేరుకుంటుందన్నారు.

'హామీలు నెరవేర్చేవరకూ ప్రశ్నిస్తాం'

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీలు నెరవేర్చేవరకూ ప్రశ్నిస్తూనే ఉంటామని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బీఆర్‌ఎస్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేశామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు విజ్జగిరి నారాయణ, గణేష్, లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్, అయ్యూబ్, అతవుల్లా, సురేందర్, ఆలం పాల్గొన్నారు.

రేపు జిల్లాలో సంచార పుస్తక ప్రదర్శన

ఆదిలాబాద్‌టౌన్: నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాలో సంచార పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఇన్‌చార్జి పత్తిపాక మోహన్, జిల్లా సమన్వయకర్త పోరెడ్డి అశోక్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 7 వరకు ఆయా పాఠశాలల్లో పుస్తక ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

రాములోరి జాతరకు వేళాయె..



రాములగుట్టపై సీతారామచంద్రుల ఆలయం



శ్రీసీతారామచంద్రుల విగ్రహాలు

- ముస్తాబైన ఆలయం
- ఈనెల 8నుంచి 12వ తేదీ వరకు జాతర
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ

తాంసి: రాములగుట్టపై వెలసిన శ్రీసీతారామచంద్రుల ఆలయం జాతరకు ముస్తాబైంది. రాములోరి జాతర సందర్భంగా ఆలయానికి రంగులు, విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు వసతులు కల్పించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గుట్టపైకి వెళ్లే దారిలో ఉన్న రాళ్లను తొలగించారు. జిల్లాలోనే పురాతన ఆలయంగా పేరొందిన రాములగుట్ట జాతరను ప్రతీ ఏటా పాలోది గ్రామస్తులు ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు. జాతరకు మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఈనెల 8 నుంచి 12 వరకు జాతర సాగనుంది. 8న ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా గుట్టపైకి తీసుకెళ్లి జాతర ప్రారంభిస్తారు. ఆలయ ప్రాంగణంలో హోమం, అర్చన, నవగ్రహ పూజలు నిర్వహిస్తారు. అనంతరం 12 తేదీన సీతారాముల కల్యాణాన్ని భక్తజనుల మధ్య ఘనంగా నిర్వహించి, రథోత్సవం నిర్వహించనున్నారు.

రాములగుట్ట ప్రాశస్త్యం..

శ్రీరాముడు వనవాస సమయంలో తాంసి మండలంలోని పాలోది శివారులో ఉన్న రాములగుట్ట ప్రాంతంలో సీతా, లక్ష్మణుల సమేతంగా వనవాసం చేసినట్లు స్థానిక చరిత్ర ద్వారా తెలుస్తోంది. వనవాస సమయంలో శ్రీ సీతారామచంద్రుల వారు గుట్టపై సేదతీరినట్లు గుట్టపై రాముడి పాదుకలు ఉండటంతో సేదతీరినట్లు ఆనవాళ్లను పూర్వీకులు గుర్తించారు. గుట్టపై ఉన్న గుహలో శ్రీరాముడి పాదుకలను ఉంచి ప్రతీ ఏటా స్థానికులు పూజలు చేసేవారు. స్వయంగా శ్రీరాముడు ఇక్కడే సేదతీరినట్లుగా గుర్తించిన నేపథ్యంలో క్రమంగా ఈ ప్రాంతాన్ని స్థానికులు అభివృద్ధి చేశారు. గుట్టపై ఆలయాన్ని నిర్మించి అందులో నూతన విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి శ్రీసీతారామచంద్రులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ఏర్పాట్లు చేస్తున్నాం



ప్రతీ ఏటా ఐదు రోజుల పాటు నిర్వహించే జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులు దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు వస్తుంటారు. చివరి రోజున కల్యాణంతో పాటు భక్తులను అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తాం. రాములగుట్ట ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు జిల్లా ప్రజాప్రతినిధుల దృష్టికి సైతం తీసుకెళ్తాం. – శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

కోనేరు నీటితో రోగాలు దూరం..

రాములగుట్టపై ఉన్న శ్రీసీతారామచంద్రుల ఆలయం వద్ద ఉన్న కోనేరుకు చాలా ప్రత్యేకత ఉంది. గుట్టపై ఉన్న కోనేరులో సంవత్సరం పొడవునా జలధార ఉంటుంది. కోనేరులోని నీటిని తాగితే ఎలాంటి వ్యాధులు రావని భక్తుల నమ్మకం. పంటచేలలో సైతం కోనేరు నీటిని తీసుకెళ్లి చల్లితే పంటలు బాగా పండుతాయి. ప్రతీ ఏటా శ్రావణ మాసంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రాములగుట్టకు వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి ఇచ్చిందేమీ లేదు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధుల కేటాయింపులో ఇచ్చిందేమీ లేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో టీపీసీసీ చీఫ్ పిలుపు మేరకు నిరసన చేపట్టి, ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రం ప్రకటించిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖయ్యూం, ఎక్బాల్, చంద్రయ్య, కలీం, మహేందర్, నర్సయ్య, లాజర్, రాహుల్, రాధాబాయి కలీంపాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సోనియాగాంధీ క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న రాథోడ్ రితేశ్

ఉట్నూర్‌రూరల్: రాష్ట్రపతి ముర్ము ప్రసంగాన్ని కించపరిచే విధంగా మాట్లాడిన సోనియా గాంధీ వెంటనే భారత రాష్ట్రపతికి, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేశ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగిస్తుండగా పూర్‌లేడి, పూర్ స్పీచ్ అంటూ సోనియా గాంధీ మాట్లాడడం సరికాదన్నారు. క్షమాపణలు చెప్పకపోతే కాంగ్రెస్ కార్యాలయాన్ని బీజేపీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయన వెంట బానోత్ జగన్, ఆడే ధన్‌లాల్, కొండేరి రమేశ్, వెంకటేశ్ మరికంటి నారాయణ, సతీశ్, బానోత్ ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ పాఠశాల విద్యార్థులను కలెక్టర్ రాజర్షిషా అభినందించారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా ఆరు ప్రధాన అంశాలను వస్తువులుగా చేసుకొని రాసిన 'ఆరోగ్య పాఠశాల– లక్ష్మీపూర్ బడి పిల్లల కథలు' పుస్తకానికి ముందుమాట రాయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు అవంతిక, అక్షిత, అక్షయ, క్షత్రఘ్న, శ్రావణి, కీర్తి, శ్రావ్య, శ్రీవేద, శ్రావణి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.అశోక్, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో రచించినట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకునేందుకు ఈ కథలు ఉపయోగపడుతాయన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి



కేజీబీవీలో వసంత పంచమి వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్: వసంత పంచమి వేడుకలను జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలతో పాటు ఆయా పాఠశాలల్లో భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ కేజీబీవీలో వేడుకలు జరిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి కవిత, సీఆర్టీలు పాల్గొన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. సొనాలలోని వివేకానంద పాఠశాలలో హోమం నిర్వహించారు.

నేరడిగొండ: మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. వేద పండితుడు ధర్మరాజ్ 50 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాల రాజేశ్వర్, సోలంకి చందర్ సింగ్, గాజుల రాజనర్సయ్య పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్, ఎస్‌వీ పాఠశాల, కురుక్షేత్ర పాఠశాలలో వసంతపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులచే శ్రీశారదమాత పూజలు నిర్వహించి అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హొర్ని వెంకట రమణ, సబ్బిడి నవీన్, నానక్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిన్నారులకు అక్షరాలు దిద్దిస్తున్న దృశ్యం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

జిల్లాకు కేంద్రమిచ్చింది గుండు సున్నా

- ఎంపీ, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్
- కేంద్రం తీరుపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఆదిలాబాద్‌కు గుండు సున్నా ఇచ్చిందని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్ వద్ద ఆందోళన చేపట్టారు. నల్ల కండువాలతో నిరసన తెలిపారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. బడ్జెట్‌లో రాష్ట్రంతో పాటు ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ రెడ్డి, దిగంబర్ రావు పటేల్, గిమ్మ సంతోష్ రావు, నగేశ్, ఫైజల్లా ఖాన్, జహీర్ రంజాని, బండారి సతీష్ పాల్గొన్నారు.

- జిల్లాకు నిధులు కేటాయించకుండా కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేంద్ర బీజేపీ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ నాయకులకు పదవులు తప్పా సమస్యలను పట్టించుకోలేదన్నారు. నాయకులు బొల్లారపు బాబన్న, కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్, వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

బోథ్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. సోమవారం జిల్లా సమస్యలపై మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నాయకులు గొర్ల రాజు, చట్ల ఉమేష్, మహమ్మద్, అరుణ్ రెడ్డి, మెరుగు భోజన్న పాల్గొన్నారు.

గుడిహత్నూర్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో మోదీ ప్రభుత్వం జిల్లాకు మొండి చేయి చూపారని మండల కాంగ్రెస్ నాయకులు బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మండలాధ్యక్షుడు మల్యాల కరుణాకర్, నాగ్‌నాథ్ అప్పా, శ్యాంరావ్, ఆరీఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయం జరిగిందని మండిపడ్డారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంతోష్, నారాయణ, రామన్నయాదవ్, వెంకట్ రెడ్డి, గంగారెడ్డి, రవి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ప్రభుత్వంపై చిన్న చూపుచుడడం సరికాదని ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. పవార్ దుదిరాం, జహీర్, ప్రకాష్, సుమన్‌బాయి, విశాల్ పాల్గొన్నారు.

నేరడిగొండ: బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి, ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సోమవారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నలుగురు ఎమ్మెల్యేలను, ఒక ఎంపీని ఓట్లేసి గెలిపిస్తే ఏం చేశారని ప్రశ్నించారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ జల్కే పాండురంగ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఇర్ల శివుడు, కిషన్, నందుకుమార్, విఠల్, గంగాధర్, నారాయణ, నగేశ్, రజక్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సభ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



ఇచ్చోడలో..

ఉట్నూర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ చేయాలని ఈనెల 7న నిర్వహించే లక్ష డ ప్పులు వెయ్యి గొంతుకల సభను విజయవంతం చే యాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమ వారం హస్నాపూర్ గ్రామంలో పోస్టర్ ఆవిష్కరించారు.

బేల: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కృష్ణపెల్లి అంకుష్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. మాదిగలు, ఉపకులాల నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

బోథ్: తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాదులో తలపెట్టిన లక్ష డప్పులు వెయ్యి గొంతుకలు సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సొనాల మండల అధ్యక్షులు గడ్పంద దినేష్ కోరారు. సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.

గుడిహత్నూర్: స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. మూడు దశాబ్దాలుగా నిర్విరామంగా చేస్తున్న పోరాటానికి గెలుపు ముంగిట నిలిచామన్నారు. వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఇచ్చోడ: లక్ష డప్పులు వేల గొంతుల సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేష్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో సభ పోస్టర్ ఆవిష్కరించారు. వర్గీకరణ అమలు విషయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.

నేరడిగొండ: మండల కేంద్రంలో సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. గోనె అడెల్లు మాదిగ, కొత్తపల్లి రాజేశ్వర్‌లు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు మాదిగలు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

'ఉపాధి' పనులు ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వంజీరి గ్రామ పంచాయతీలో గల నందిగూడ గ్రామంలో ఉపాధిహామీ పనులు సోమవారం ప్రారంభించారు. కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని ఏపీవో బుచ్చన్న సూచించారు. కార్యక్రమంలో సాంకేతిక నిపుణులు సయ్యద్‌సోయబ్, క్షేత్ర సహాయకుడు గులాబ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ సోమవారం ఆర్వో వాటర్ ప్లాంట్ యంత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హొర్ని వెంకట రమణ, కొత్త శంకర్, రాజేశ్వర్, రవీందర్, చట్ల ఉత్తం పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

బోథ్: సొనాల మండల కేంద్రానికి చెందిన రమేశ్, అనీష్‌ల మధ్య ఇటీవల గొడవ జరగడంతో అనీష్‌పై అట్రాసిటీ కేసు జనవరి 30న నమోదైంది. కాగా డీఎస్పీ జీవన్ రెడ్డి కేసు విషయమై సొనాల గ్రామంలో సోమవారం విచారణ చేపట్టారు. ప్రత్యక్ష సాక్షులను విచారించారు.

రేపు జాబ్‌మేళా

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో, టాస్క్‌ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సౌజన్యంతో ఈనెల 5న ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జె.సంగీత, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ శ్రావణిలు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రి, ఎంఎస్సీ కెమిస్ట్రి, ఐటీఐ, మెకానికల్ డిప్లొమా 2022– 25 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 97035 33626 సంప్రదించాలని కోరారు.

భవనాన్ని అప్పగించిన కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని నూతన అంబేడ్కర్ భవనం ఎదుట గల పాత భవనాన్ని వినియోగించుకునేందుకు జిల్లా కలెక్టర్ అప్పగించారని అంబేడ్కర్ సంఘాల ఐక్యపోరాట సమితి నాయకులు తెలిపారు. సోమవారం అల్లూరి భూమన్న, దర్శనాల నగేశ్ మాట్లాడారు. అప్పగించిన భవనం వద్ద వాహనాల పార్కింగ్‌తో పాటు సీనియర్ సిటిజన్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

పొచ్చెర ఎంపీటీసీ పరిధిలోకి రెండు గ్రామాలు

బోథ్: బోథ్ మండలంలోని ఎంపీటీసీ స్థానాల్లో స్వల్ప మార్పు జరిగింది. ఇటీవల అధికారులు వెల్లడించిన ఎంపీటీసీ స్థానాల జాబితాలో కనుగుట్ట ఎంపీటీసీ స్థానం పరిధిలో కుచులాపూర్, పిప్పల్‌ధరి గ్రామాలు ఉండగా, కుచులాపూర్, పిప్పల్‌ధరి గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ గ్రామాలను పొచ్చెర ఎంపీటీసీ స్థానం పరిధిలో ఉంచాలని ఇటీవల అధికారులకు విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు విన్నపం మేరకు అధికారులు పరిశీలించి కనుగుట్ట గ్రామాన్ని ఎంపీటీసీ స్థానంగా గుర్తించి, కుచులాపూర్, పిప్పల్‌ధరి గ్రామాలను పొచ్చెర ఎంపీటీసీ స్థానం పరిధిలోకి తీసుకువచ్చారు.

రోడ్డుకు మరమ్మతులు

బోథ్: సొనాల మండల కేంద్రం నుంచి రాజరాజేశ్వర ఆలయానికి వెళ్లే మట్టి దారిని గ్రామస్తులు చందాలు వేసి మరమ్మతులు చేయించారు. ఈనెల 24న శివపార్వతుల కల్యాణం ఉన్నందున ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడవద్దని రోడ్డును బాగు చేయిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన తుల సదానందం రూ. 5 వేలు, సుభాష్ సూర్య రూ. 5 వేలు, అడిపె శ్రీనివాస్ రూ. 5 వేలు విరాళంగా అందించారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నేరడిగొండ: తాపీ మేస్త్రీ సంఘం సభ్యులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.